నేటి కందం- నేటికి అందం



బోనాల జాతర తెలం
గాణా సంస్కృతిని దెలిపి ఘనతరమగుచున్
రాణించగ జగదంబిక
జ్ఞానామృత మిదు ప్రజలకు సంతోషముతోన్ !!

(తెలంగాణా లో బోనాలు జగదంబిక కు తొలిబోనం సమర్పించడంతో ప్రారంభం అయ్యాయి)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

నియంతృత్వ పరిపాలన
నిలువదు ఏనాటికి
జనం తల్చుకుంటే పోవు
జీవమిడిచి కాటికి
గతంనుండి నేటిదాకా
గమనిస్తే ఇదే చరితం
గుణపాఠం నేర్వకుంటే
గల్లంతే ఇక భవితం

చురక



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ శుక్రవారం 27-6-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:245 పేజీలు:6 వెల: రూ.1/-

### రేవంత్ సర్కార్ మరో శుభవార్త..

## ఆరోగ్యశాఖలో భారీగా ఉద్యోగాల భర్తీ



హైదరాబాద్, జూన్ 26:తెలంగాణ ప్రభుత్వం మరో శుభవార్త తెలిపింది. ఆరోగ్యశాఖలో మరోసారి భారీగా ఉద్యోగాల భర్తీ చేస్తున్నట్లు రేవంత్ ప్రభుత్వం ప్రకటించింది. ఒకేరోజు మూడు వేర్వేరు జాబ్ నోటిఫికేషన్లు ఇవ్వడానికి మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు సిద్ధమైంది.

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం మరో శుభవార్త తెలిపింది. ఆరోగ్యశాఖలో మరోసారి భారీగా ఉద్యోగాల భర్తీ చేస్తున్నట్లు రేవంత్ ప్రభుత్వం ప్రకటించింది. ఒకేరోజు మూడు వేర్వేరు జాబ్ నోటిఫికేషన్లు ఇవ్వడానికి మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు సిద్ధమైంది. ప్రభుత్వ ప్రకటనతో అసిస్టెంట్ ప్రొఫెసర్, డెంటల్ అసిస్టెంట్ సర్జన్స్, స్పీచ్ పాథాలజిస్ట్ పోస్టులకు నోటిఫికేషన్లు వెలువడనున్నాయి.

ప్రభుత్వ హాస్పిటల్స్‌లో గడిచిన 17 నెలల్లో 8 వేలకుపైగా పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసింది. మరో 3212 నర్సింగ్ ఆఫీసర్లు, 732 ఫార్మసిస్ట్, 1284 ల్యాబ్ టెక్నీషియన్, 1950 మల్టీ పర్పస్ ఫీమేల్ హెల్త్ అసిస్టెంట్ పోస్టులకు భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది.

ఇప్పటికే ఆయా పోస్టుల ఫలితాలను విడుదల చేయడంతో మెరిట్ జాబితాలు సిద్ధమవుతున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో మెడికల్ కాలేజీల్లోని పోస్టుల భర్తీకి మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు సిద్ధమైంది. ఈరోజు(గురువారం) సాయంత్రం లేదా రేపు(శుక్రవారం) ఉదయం మూడు నోటిఫికేషన్లు విడుదల కానున్నాయి.

## గోల్కొండలో ప్రారంభమైన బోనాల సందడి

### – తొలి రోజు బోనమెత్తిన పలువురు ప్రముఖులు



హైదరాబాద్, జూన్ 26:హైదరాబాద్‌లో ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మా.. సల్లంగ చూడు అని వేడుకుంటూ బోనాల సంబురానికి ఆడపడుచులు గురువారం శ్రీకారం చుట్టారు. ఆషాఢ మాసంలో తొలి గురువారం గానీ, ఆదివారం గానీ బోనాల సందడి ప్రారంభమవుతుంది. ఈ ఏడాది ఆషాఢం మాసం గురువారం రావడంతో బోనాల పండగ ప్రారంభించారు. ఆనవాయితీ ప్రకారం గోల్కొండ జగదాంబిక ఆలయం నుంచి బోనాల సంబురాలకు భక్తులు శ్రీకారం చుట్టారు. దీంతో గొల్కొండ ప్రాంతం భక్తులతో కిటకిటలాడుతోంది.

#### పట్టువస్త్రాలు సమర్పించి తొలిబోనాలు ఎత్తిన స్పీకర్, మంత్రులు

ఆషాఢమాస బోనాల సంబురం సందర్భంగా లంగర్ హౌజ్ చౌరస్తాలో గోల్కొండ జగదాంబ మహంకాళి అమ్మవారికి ప్రభుత్వం తరుపున స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, దేవదాయశాఖ మంత్రి కొండా సురేఖ, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టు వస్త్రాలు, తొలి బోనం సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఈ సందర్భంగా భక్తులతోపాటు నృత్యం చేస్తూ వారిని పొన్నం ప్రభాకర్ ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ ఎంసీ మేయర్ గద్వాల విజయ లక్ష్మి, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన , సీపీ సీవీ ఆనంద్ ,కాంగ్రెస్ సీనియర్ నేత విహెచ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ కూడా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు..

అనంతరం మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ఆషాడ మాసంలో హైదరాబాద్‌లోని సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న బోనాల సంబురాలకు ప్రపంచ స్థాయి గుర్తింపు ఉందని అన్నారు. హైదరాబాద్ ప్రజలు వచ్చే భక్తులకు మంచి ఆతిధ్యం ఇచ్చేలా అంగరంగ వైభవంగా జరుపుకోవాలని సూచించారు. బోనాల పండగ సందర్భంగా మూడు వేల దేవాలయాలకు పండగ కోసం 20 కోట్ల రూపాయలు నిధులు ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. నెల రోజుల పాటు వివిధ ఆలయాల్లో బోనాలు సమర్పిస్తూ రంగం కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. జగదాంబ మహంకాళి అమ్మవారి ఆశీర్వాదంతో ఈ సంవత్సరం సంవృద్ధి వర్షాలతో పాడి పంటలతో అందరూ ఆరోగ్యాలతో ఉండాలని ఆ అమ్మవారిని వేడుకున్నట్లు మంత్రులు కొండా, పొన్నం తెలిపారు

#### కవిత, ఈటల బోనమెత్తారు

గోల్కొండలో ఉన్న జగదాంబిక అమ్మవారికి, అలాగే ఎల్లమ తల్లికి బోనలను మహిళలు సమర్పించారు. అలాగే తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కూడా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన బోనం సమర్పించారు. అలాగే బీజేపీకి చెందిన మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజంద్ర కూడా అమ్మవారిక బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా యావత్ ప్రజానికానికి వారిద్దరు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ప్రజలంతా కలిసిమెలిసి ప్రశాం తంగా జీవించే భాగ్యం కలగాలని.. జాతరను అంగరంగ వైభవంగా భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

#### బారులు తీరిన భక్తులు

గోల్కొండ, లంగర్ హౌజ్ చౌరస్తా వద్ద జగదాంబ మహంకాళికి బోనలు సమర్పించడం కోసం భక్తులు బారులు తీరారు. బోనలు సమర్పించి మహిళలకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి పంపించారు. వీఐపీల తాకిడి ఎక్కువగా ఉండడంతో భక్తులు కాస్తా ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

## అదుపుతప్పి అలకనంద నదిలో పడిపోయిన బస్సు

### –11 మంది ప్రయాణికులు గల్లంతు



డెహ్రాడూన్ జూన్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఉత్తరాఖండ్ రాష్ట్రం రుద్రప్రయాగ్ జిల్లా ఘోల్టీర్ లో అలకనంద నదిలో బస్సు అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో 11 మంది ప్రయాణికులు గల్లంతయ్యారు. పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. రెస్క్యూ సిబ్బంది ఏడుగురిని కాపాడి ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగినప్పుడు బస్సులో 18 మంది ప్రయాణికులు ఉన్నట్టు సమాచారం. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

## డాకింగ్ విజయవంతం.. ఐఎస్ఎస్‌లో అడుగుపెట్టిన శుభాంషు శుక్లా



న్యూఢిల్లీ, జూన్ 26:భారత ఖగోళ చరిత్రలో మరో చారిత్రక ఘట్టం నమోదైంది. ఈ సాయంత్రం, క్రూ డ్రాగన్ క్యాప్సూల్ "గ్రేస్" అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంతో డాకింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. దీంతో స్పేస్ఎక్స్ ? నాసా సంయుక్తంగా చేపట్టిన అక్షియం-4 మిషన్‌లో భాగంగా భారత వ్యోమగామి, ఉత్తరప్రదేశ్‌కి చెందిన శుభాంషు శుక్లా విజయవంతంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం ని చేరుకున్నారు.

దీంతో, శుభాంషు శుక్లా రాకేష్ శర్మ తర్వాత అంతరిక్షంలోకి ప్రవేశించిన రెండవ భారతీయుడిగా.. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న మొదటి భారతీయుడిగా గుర్తింపు పొందారు.

ఈ మిషన్ భారత కాలమానం ప్రకారం నిన్న (జూన్ 25న) తెల్లవారుజామున 12:01కి ప్రారంభమైంది. శుభాంషు శుక్లాతో పాటు ఈ ప్రయాణంలో మిషన్ కమాండర్ పెగ్గీ విట్సన్ (అమెరికా), స్వావోష్ ఉజ్‌నాన్‌స్కీ (పోలాండ్), టిబోర్ కాపు (హంగేరీ) భాగస్వాములయ్యారు. ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా ప్రారంభమైన ఈ ప్రయాణం దాదాపు 28 గంటల గగనయానం అనంతరం విజయవంతమైంది.

ఈ మిషన్‌లో శాస్త్రీయ ప్రయోజనాలూ కీలకంగా ఉన్నాయి. రాబోయే 14 నుండి 21 రోజులలో సుమారు 60కు పైగా శాస్త్రీయ ప్రయోగాలు జరగనున్న ఈ మిషన్‌లో, శుభాంషు భారత శాస్త్రవేత్తల తరఫున ఏడు కీలక ప్రయోగాల్లో పాల్గొంటారు. సూక్ష్మ శైవలాలపై గురుత్వాకర్షణ లేనప్పుడు కలిగే ప్రభావం, మానవ కండరాల నిర్వీర్యత, సూక్ష్మజీవుల ప్రవర్తన, మానసిక న్యూరోకాగ్నిటివ్ పనితీరులో మార్పులు వంటి అంశాలపై అధ్యయనం చేయనున్నారు.

## ద్విచక్ర వాహనాల నుంచి టోల్ ఫీజు వసూలు!

హైదరాబాద్ జూన్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );జాతీయ రహదారులపై ఇప్పటి వరకూ ద్విచక్ర వాహనాలకు టోల్ నుంచి మినహాయింపు ఇస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఇకపై టూవీలర్స్ కూడా టోల్ కట్టాల్సి ఉంటుందట. ద్విచక్ర వాహనాల నుంచి టోల్ ఫీజు వసూలు చేయాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి.జాతీయ రహదారులపై ఇప్పటి వరకూ ఫోర్ వీలర్స్, ఇతర పెద్ద వాహనాలకు మాత్రమే టోల్ ఫీజు వసూలు చేస్తున్నారు. దీంతో ద్విచక్ర వాహనాలు, మూడు చక్రాల ఆటోలు టోల్ కట్టకుండానే జాతీయ రహదారులపై ప్రయాణిస్తున్నాయి. అయితే, ఈ విధానంలో మార్పునకు కేంద్రం శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. వచ్చే నెల అంటే జులై 15 నుంచి జాతీయ రహదారులపై ద్విచక్ర వాహనాలకు టోల్ వసూలు చేయాలని కేంద్రం భావిస్తున్నట్లు సమాచారం. అయితే, దీనిపై అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. త్వరలోనే ప్రభుత్వం ప్రకటించే అవకాశం ఉందని జాతీయ మీడియా పేర్కొంది. ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంటే ద్విచక్ర వాహనదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశం ఉంది.

## మెక్సికోలో కాల్పులు కలకలం.. 12 మంది మృతి

గ్వానాజువాట జూన్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: మెక్సికోలో కాల్పులు కలకలం సృష్టించాయి. గ్వానాజువాట ప్రాంతం ఇరాపువాటోలో గుర్తు తెలియని వ్యక్తి కాల్పులకు తెగపడడంతో 12 మంది మృతి చెందారు. 20 మంది గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరా లప్రకారం? సెయింట్ జాన్ బాప్టిస్ట్ చర్చిలో స్ట్రీట్ ఫెస్టివల్‌లో భాగంగా డ్రమ్స్ వాయిస్తూ, డ్యాన్స్‌లు చేస్తుండగా ఓ గుర్తు తెలియని దుండగుడు కాల్పులు జరపడంతో 12 మంది చనిపోగా 20 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనను మెక్సికన్ అధ్యక్షురాలు క్లాడియా షేన్‌బాయ్ తీవ్రంగా ఖండించారు. మృతులకు సంతాపం తెలపగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకలించారు. ఇది దురదృష్టకరమైన సంఘటన అని దర్యాప్తు చేస్తామన్నారు. మే నెలలో గ్వానాజువాటో ప్రాంతం శాన్ బార్టోలో డి బెరియోస్లో దుండగులు కాల్పులు జరపడంతో ఏడుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. గత సంవత్సరం నుంచి తుపాకీ తుటాలకు వెయ్యి మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

## బ్లాక్‌బాక్స్ డేటా విశ్లేషణ వేగవంతం.. 30రోజుల్లో ప్రాథమిక నివేదిక !

అహ్మదాబాద్ , జూన్ 26: అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై దర్యాప్తు కీలక దశకు చేరుకుంది. ప్రమాదస్థలం నుండి స్వాధీనం చేసుకున్న రెండు బ్లాక్‌బాక్స్‌లు ఫ్లైట్ డేటా రికార్డర్ , కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ డేటా డౌన్‌లోడ్ ప్రక్రియ జూన్ 25న విజయవంతంగా పూర్తయ్యింది. ఈ డేటా ప్రస్తుతం ఢిల్లీలోని ఏఎఐబీ ప్రత్యేక ప్రయోగశాలలో విశ్లేషణలో ఉంది.

ఈ దర్యాప్తు ఎఅంా మార్గదర్శకాలను అనుసరిస్తూ జరుగుతోంది.

జూన్ 13న నియమితమైన ప్రత్యేక దర్యాప్తు బృందంలో విమానయాన నిపుణులు, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ అధికారులు, అలాగే అమెరికాకు చెందిన నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ సభ్యులు కూడా ఉన్నారు.

టేకాఫ్ తరువాత కొన్ని నిమిషాల్లోనే ప్రమాదం ఎలా జరిగింది.. పైలట్ల మధ్య సంభాషణలేమిటి సాంకేతిక లోపాలు ఉన్నాయా. వంటి కీలక విషయాలపై స్పష్టత కోసం బ్లాక్‌బాక్స్ డేటా విశ్లేషణ చాలా ప్రాముఖ్యంగా మారింది.

ప్రభుత్వ వర్గాల ప్రకారం, బ్లాక్‌బాక్స్ డేటా ఆధారంగా 30 రోజులలోపు ప్రాథమిక నివేదికను విడుదల చేయాలనే లక్ష్యంతో అధికారులు పనిచేస్తున్నారు.

అయితే పూర్తి నివేదిక సిద్ధమవ్వడానికి మరికొంత సమయం పడే అవకాశం ఉంది.

## గంజాయి, డ్రగ్స్ అమ్మితే వెన్నువిరుస్తాం : సీఎం రేవంత్



హైదరాబాద్, జూన్ 26:హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ఈరోజు నిర్వహించిన "అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం" కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గౌరవ అతిథిగా పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి సినీ తారలు రామ్ చరణ్ , విజయ్ దేవరకొండ తదితర ప్రముఖులు కూడా హాజరై, మాదకద్రవ్యాలపై అవగాహన పెంచాల్సిన అవసరాన్ని ఎత్తిచూపారు.

## శిబు సోరెన్‌ను పరామర్శించిన రాష్ట్రపతి ముర్ము



న్యూఢిల్లీ, జూన్ 26:ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జార్ఖండ్ మాజీ సీఎం శిబు సోరెన్ ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పరామర్శించారు. ఇవాళ ఆసుపత్రికి వెళ్లిన రాష్ట్రపతి.. అక్కడ శిబు సోరెన్ కుమారుడు, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను కలిశారు. ఈ సందర్భంగా శిబు సోరెన్ ఆరోగ్య పరిస్థితి గురించి హేమంత్ సోరెన్‌ను అడిగి తెలుసుకున్నారు.

81 ఏళ్ల శిబు సోరెన్ తీవ్ర అస్వస్థతతో రెండు రోజుల క్రితం ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆసుపత్రిలో శిబు సోరెన్‌కు చికిత్స కొనసాగుతోంది. అయితే, రాష్ట్రపతి ముర్ము 2015 మే నుంచి 2021 జులై వరకూ జార్ఖండ్ గవర్నర్‌గా పని చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో శిబు సోరెన్‌తో ఆమెకు పరిచయం ఉంది. ఈ పరిచయంతోనే మాజీ సీఎంను రాష్ట్రపతి పరామర్శించారు.

## ఆపరేషన్ సిందూర్ మా హక్కు..

### –చైనా గడ్డనుంచే పాక్‌పై నిప్పులు చెరిగిన రాజ్‌నాథ్





న్యూ డిల్లీ జూన్ 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పొరుగుదేశం పాకిస్థాన్‌పై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. కొన్ని దేశాలు (పరోక్షంగా పాక్‌ను ఉద్దేశిస్తూ) సీమాంతర ఉగ్రవాద విధానాన్ని సాధనంగా ఉపయోగిస్తున్నాయంటూ చైనా గడ్డనుంచే పాక్‌పై నిప్పులు చెరిగారు. తమ సొంత ప్రయోజనాల కోసం ఉగ్రవాదులను పెంచి పోషించే దేశాలు అందుకుతగ్గ పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. చైనాలోని కింగ్‌డావోలో జరుగుతున్న షాంఘై సహకార సంస్థ (ఎస్సీఓ) రక్షణ మంత్రుల సమావేశానికి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరయ్యారు. గల్వాన్ లోయ ఘటన తర్వాత ఆయన చైనాలో పర్యటించడం ఇదే మొదటిసారి. ఈ సమావేశంలో ఇటీవలే పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి గురించి రాజ్‌నాథ్ మాట్లాడారు. దీనికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' గురించి కూడా వివరించారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ నిర్వహించడం భారత్ హక్కు అంటూ కుండ బద్దలు కొట్టారు.'కొన్ని దేశాలు సీమాంతర ఉగ్రవాదాన్ని ఒక విధాన పరికరంగా మలుచుకున్నాయి. తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్నాయి. అలాంటి ద్వంద్వ ప్రమాణాలకు చోటు ఉండకూడదు. అటువంటి దేశాల చర్యలను ఏ మాత్రం ఉపేక్షించకూడదు. అలాంటి వాటిని ఎస్సీఓ ఖండించాలి. శాంతి, ఉగ్రవాదం ఎప్పటికీ కలిసి ఉండలేవు. విధ్వంసాలకు కారణమయ్యే ఆయుధాలు ఉగ్రవాదుల చేతుల్లో ఉండకూడదు. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు నిర్ణయాత్మకమైన చర్య అవసరం. దుష్టశక్తులకు వ్యతిరేకంగా పోరాడేందుకు మనమంతా ఐక్యం కావాలి' అంటూ ఆయా సభ్య దేశాలకు రాజ్‌నాథ్ పిలుపునిచ్చారు.

## టేకాఫ్ అయిన పది నిమిషాల్లోనే విమానం ఇంజిన్ నుంచి మంటలు, పొగలు

### – అప్రమత్తమైన పైలట్ విమానాన్ని అత్యవసరంగా ల్యాండ్

న్యూ డిల్లీ జూన్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );అమెరికాలో ఓ విమానానికి పెను ప్రమాదం తప్పింది. టేకాఫ్ అయిన పది నిమిషాల్లోనే విమానం ఇంజిన్ నుంచి మంటలు, పొగలు వచ్చాయి దీంతో అప్రమత్తమైన పైలట్ విమానాన్ని అత్యవసరంగా ల్యాండ్ చేశారు. దీంతోపెను ప్రమాదం తప్పినట్లైంది.అమెరికన్ ఎయిర్‌లైన్స్ కు చెందిన విమానం బుధవారం ఉదయం 8:11 గంటలకు లాస్‌వేగాస్ ఎయిర్‌పోర్టు నుంచి నార్త్ కరోలినాకు బయల్దేరింది. విమానం టేకాఫ్ అయిన తర్వాత సమస్య తెలెత్తింది. గాల్లో ఉండగా ఇంజిన్ నుంచి మంటలు, పొగలు వచ్చాయి. అప్రమత్తమైన పైలట్ విమానాన్ని వెంటనే వెనక్కి మళ్లించారు. 8:20కి లాస్‌వేగాస్ ఎయిర్‌పోర్ట్‌లో సురక్షితంగా ల్యాండ్ చేశారు. ఆ సమయంలో విమానంలో 153 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారు. ఈ ఘటనతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అయితే, ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలూ కాకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

అప్రమత్తమైన పైలట్ విమానాన్ని అత్యవసరంగా ల్యాండ్

న్యూ డిల్లీ జూన్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );అమెరికాలో ఓ విమానానికి పెను ప్రమాదం తప్పింది. టేకాఫ్ అయిన పది నిమిషాల్లోనే విమానం ఇంజిన్ నుంచి మంటలు, పొగలు వచ్చాయి దీంతో అప్రమత్తమైన పైలట్ విమానాన్ని అత్యవసరంగా ల్యాండ్ చేశారు. దీంతోపెను ప్రమాదం తప్పినట్లైంది.అమెరికన్ ఎయిర్‌లైన్స్ కు చెందిన విమానం బుధవారం ఉదయం 8:11 గంటలకు లాస్‌వేగాస్ ఎయిర్‌పోర్టు నుంచి నార్త్ కరోలినాకు బయల్దేరింది. విమానం టేకాఫ్ అయిన తర్వాత సమస్య తెలెత్తింది. గాల్లో ఉండగా ఇంజిన్ నుంచి మంటలు, పొగలు వచ్చాయి. అప్రమత్తమైన పైలట్ విమానాన్ని వెంటనే వెనక్కి మళ్లించారు. 8:20కి లాస్‌వేగాస్ ఎయిర్‌పోర్ట్‌లో సురక్షితంగా ల్యాండ్ చేశారు. ఆ సమయంలో విమానంలో 153 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారు. ఈ ఘటనతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అయితే, ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలూ కాకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

# వారాహిని అవతారంలో కనకదుర్గమ్మ

-ఇంద్రకీలాద్రిపై ఘనంగా వారాహిని నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
-తొమ్మిది రోజులపాటు గుప్తా నవ రాత్రుల పూజలు
-సర్వాంగ సుందరంగా ఇంద్రకీలాద్రి ముస్తాబు
-అమ్మకు పవిత్ర ఆషాడ సారె.
-తొలి ఆషాడ సారె సమర్పించిన ఈవో దంపతులు
-జగన్మాత దర్శనానికి తరలివస్తున్న భక్తులు

అమరావతి, జూన్ 26: సస్యశ్యామల రూపినీ వారాహిని శరణు, శరణు, పాహిమాం పాహిమాం అంటూ భక్తులు జగన్మాతను కొలుస్తున్నారు. అమ్మలగన్న అమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ ఆ కనకదుర్గమ్మ వారాహిని భక్తులకు అనుగ్రహిస్తుంది.



శ్రీ విశ్వావసు నామ సంవత్సర వారాహి నవరాత్రి ఉత్సవాలు ఇంద్రకీలాద్రి పై అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి.

విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జూన్ 26వ తేదీ నుండి జులై 4వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు జరిగే గుప్త నవరాత్రులు అట్టహాసంగా గురువారం నుండి ప్రారంభమయ్యాయి. వారాహి ఉత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రి సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. గుప్త నవరాత్రి ప్రారంభ పూజల్లో భాగంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి వీకే శినా నాయక్ దంపతులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. యాగశాలలో మొదటిరోజు ఉదయం విఘ్నేశ్వర పూజ రిత్విక్ వరుణ పుణ్యావాచనం, అఖండ దీపారాధన, అంకురార్పణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ఎల్ దుర్గాప్రసాద్ ఉప ప్రధానార్చకులు కోటా ప్రసాద్ ఆధ్వర్యంలో అర్చకులు విశేష పూజలను శాస్త్రోక్తంగా, వైభవంగా నిర్వహించారు.

తొలి ఆషాడ సారె సమర్పణ..

ఇంద్రకీలాద్రిపై కొలువైయున్న శ్రీ కనకదుర్గమ్మ వారి నీ ఇంటి ఆడపడుచు గా భావించి ఆషాడ మాసం సందర్భంగా భక్తులందరూ ఆషాడసారె సమర్పించడం ఆనత ఆనవాయితీగా వస్తుంది. ఈ క్రమంలోనే శ్రీ విశ్వ వాసు నామ సంవత్సర ఆషాడ మాస ప్రారంభం సందర్భంగా గురువారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రధాన ఆలయం నుండి మహా మండపం ఆరవ అంతస్తులకి ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఏటా ఆనవాయితీగా మొదటి ఆషాడ సారెను దేవస్థానం సిబ్బంది తరపున ఆలయ కార్యనిర్వాహణాధికారి వీకే శినా నాయక్ దంపతులు, దేవస్థానం సిబ్బంది కుటుంబ సభ్యులతో వచ్చి అమ్మవారికి పరమ పవిత్రమైన సారెను సమర్పించారు.

ప్రధాన ఆలయం నుండి సారే సంబరాలతో మహా మండపం చేరి అమ్మవారికి నివేదన చేసి భక్తులకు పంపిణీ చేశారు. తొలి ఆషాడ సారే అమ్మవారికి అందించే కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు ఉప ప్రధానార్చకులు, ముఖ్య అర్చకులతో పాటు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ రంగారావు ,అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ బి వెంకటరెడ్డి, ఎన్ రమేష్ బాబు, ఎం తిరుమలరావు, శ్రీనివాస్, కే గంగాధర్ రావుతో పాటు ఆలయ సిబ్బంది అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వారాహిని అవతారంలో ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకోవడంతో పాటు అమ్మవారికి పవిత్ర సారే సమర్పించేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రి కి క్యూ కట్టారు. అమ్మవారి దర్శనానంతరం భక్తులకు అర్చకులు ఉచిత ప్రసాదాన్ని పంపిణీ చేయడంతో పాటు సామూహిక ఆశీర్వచనాన్ని కూడా అందజేశారు.

ఆషాడ సారె సమర్పించిన రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత..

శ్రీ కనకదుర్గమ్మ వారికి గురువారం రాష్ట్ర హోంశాఖ మంత్రి వి.అనిత (ఎజీనిణజీశ్రీజీజూబీటతి ంనితిబిప్తజీ) పవిత్ర ఆషాడ సారెను సమర్పించారు. ఇంద్రకీలాద్రి కి అమ్మవారి దర్శనానికి వచ్చిన మంత్రి అనితకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనానంతరం వేద ఆశీర్వచనంతో పాటు అమ్మవారి చిత్రపటం ప్రసాదాలను అందజేశారు. అనంతరం మంత్రి అనిత మహా మండపం ఆరవంతస్తులు అమ్మవారికి పవిత్ర సాధన సమర్పించి అమ్మవారి ప్రత్యేక ఆశీస్సులను అందుకున్నారు.

# 1న పాడేరులో సీఎం పర్యటన.. ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



అమరావతి, జూన్ 26:జూలై 1వ తేదీన అల్లూరి సీతారామరాజు జిల్లా (పాడేరు) లో జరగనున్న పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి విచ్చేస్తున్న నేపథ్యంలో సంబంధిత పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ , జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, ఇతర అధికారులతో కలసి గురువారం ఉదయం పాడేరు మండలం లగిశపల్లిలో హెలిప్యాడ్ స్థలాన్ని, బహిరంగ సభ నిర్వహణ స్థలాన్ని అలాగే పెన్షన్ పంపిణీ పంపిణీ చేయనున్న ఉగ్గంగొయ్యి గ్రామాన్ని పరిశీలించారు.

ముఖ్యమంత్రి సభాస్థలికి చేరుకునే దగ్గర నుంచి తిరుగుపయనమయ్యే వరకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ స్థల పరిశీలన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె.అభిషేక్ గౌడ, డి.ఎస్.పి షేక్ అహమ్మద్ షహాబాజ్, జిల్లా గ్రామీణా భివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ అధికారి పి మురళీ, తహసీల్దార్ వి.త్రినాథరావు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.


కొప్పర్తి పుస్తకాల ఆవిష్కరణ

జూన్ 29, 2025 ఆదివారం సాయంత్రం 6 గంటలకు

సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియం

బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్, హైదరాబాద్

అధ్యక్షత

శ్రీ వాడ్రేవు చినవీరభద్రుడు

ప్రముఖ కవి, విమర్శకులు, చిత్రకారులు



చరిత్ర, సామాజిక వ్యాసాల సంపుటి

సంభాషణ

ఆవిష్కరణ ఆచార్య వకుళాభరణం రామకృష్ణ

ప్రముఖ చరిత్రకారులు

విశ్లేషణ శ్రీ దూసనపూడి సోమసుందర్

జాతీయ కార్యదర్శి, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్



మూడు కవిత్వ సంపుటాల సంకలనం

కొప్పర్తి కవిత్వం

ఆవిష్కరణ డా. పాపినేని శివశంకర్

కేంద్ర సాహిత్య అకాడెమి పురస్కారగ్రహీత

విశ్లేషణ శ్రీ దర్భశయనం శ్రీనివాసాచార్య

ప్రముఖ కవి, విమర్శకులు

యువకవుల స్పందన కట్టా సిద్ధార్థ

కడలి

అందరికీ ఆహ్వానం

సాహితీమిత్రులు, హైదరాబాద్


# లారీని ఢీకొట్టిన కారు

## - ఎస్ఐ, కానిస్టేబుల్ దుర్మరణం

సూర్యాపేట, జూన్ 26: సూర్యాపేట జిల్లా కోదాడ బైపాస్‌లోని దుర్గాపురం వద్ద గురువారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వస్తున్న కారు , ఆ ప్రాంతంలో నిలిచివున్న లారీని వెనుక నుండి ఢీకొట్టింది.

ఈ ఘటనలో ఇద్దరు పోలీసులు దుర్మరణం చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. మృతులను ఆంధ్రప్రదేశ్‌లోని కోనసీమ జిల్లా ఆలమూరుకు చెందిన ఎస్ఐ అశోక్ , కానిస్టేబుల్ స్వామిగా గుర్తించారు. ప్రమాద సమయంలో వారు కారు ప్రయాణిస్తున్నారు.గాయపడిన ఇద్దరిని స్థానికులు , పోలీసులు కలిసి కారులో నుంచి బయటకు తీసి, తక్షణమే కోదాడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

# శ్రీ నారాయణ గురు చెప్పిన విషయాలు మనుషులందరికీ గొప్ప నిధి: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జూన్ 26:గొప్ప ఆధ్యాత్మిక, నైతిక విలువలు కలిగిన మహానుభావులు శ్రీ నారాయణ గురు.. మహాత్మాగాంధీల మధ్య జరిగిన చారిత్రక చర్చకు శతాబ్ది అవుతోన్న సందర్భంగా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అందరికి శుభాకాంక్షలు తెలిపిన ఆయన దేశ చరిత్రలోనే అద్భుతమైన ఘట్టానికి ఈ వేదిక సాక్ష్యంగా నిలుస్తోందన్నారు. మన స్వాతంత్రోద్యమానికి ఈ ఇద్దరు మహానుభావుల మధ్య జరిగిన చారిత్రక చర్చ కొత్త దిశానిర్దేశం చేసిందని.. స్వాతంత్ర్య లక్ష్యాలకు, స్వతంత్ర భారత్ కలకు నిర్దిష్ట అర్థాన్నించిందని పేర్కొన్నారు. "100 సంవత్సరాల క్రితం జరిగిన శ్రీ నారాయణ గురు– మహాత్మాగాంధీల సమావేశం నేటికీ స్ఫూర్తిదాయకంగా, సందర్భోచితంగా ఉంది. సామాజిక సామరస్యం, అభివృద్ధి చెందిన భారత్ విషయంలో సమష్టి లక్ష్యాల కోసం ఉత్తేజానిచ్చే వనరుగా పనిచేస్తోంది" అని వ్యాఖ్యానించారు. ఈ చారిత్రాక శతాబ్ది సందర్భంగా శ్రీ నారాయణ గురు పాదాలకు నమస్కరించిన ప్రధాని.. మహాత్మాగాంధీకి నివాళులర్పించారు.

"శ్రీ నారాయణ గురు ఆదర్శాలు మానవాళి అందరికీ గొప్ప ఆస్తి" అని ప్రధాని వ్యాఖ్యానించారు. దేశానికి, సమాజానికి సేవ చేసే విషయంలో నిబద్ధతతో పనిచేయాలనుకునే వారికి శ్రీ నారాయణ గురు ఒక మార్గదర్శక రేఖగా నిలుస్తారని అన్నారు. సమాజంలో అణచివేత, దోపిడీకి గురైన వర్గాలతో పాటు అణగారిన ప్రజలతో తనకున్న చిరకాల సంబంధాన్ని ఆయన పంచుకున్నారు. ఈ వర్గాల అభ్యున్నతి కోసం తాను ప్రధాన నిర్ణయాలు తీసుకునేటప్పుడు గురుదేవున్ని గుర్తుకు తెచ్చుకుంటానని ప్రధానంగా చెప్పారు. శతాబ్దాల వలసలో జరిగిన వక్రీకరణల వల్ల 100 ఏళ్ల క్రితం ఉన్న పరిస్థితుల గురించి ఆయన మాట్లాడారు. ఆ సమయంలో ప్రబలంగా ఉన్న సామాజిక దురాచారాలకు వ్యతిరేకంగా మాట్లాడేందుకు ప్రజలు భయపడేవారని అన్నారు. అయితే శ్రీ నారాయణ గురు వ్యతిరేకతకు, సవాళ్లకు భయపడలేదని ఆయన పేర్కొన్నారు. సత్యం, సేవ, సద్భావనపై అపారమైన నమ్మకంతో కూడిన సామరస్యం, సమానత్వం విషయంలో ఆయన దృఢ నిశ్చయంతో ఉండేవారని అన్నారు. ఇదే మనకు 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్' మార్గాన్ని చూపుతోందని తెలిపారు. చిట్ట చివరి స్థాయి వ్యక్తికి అత్యున్నత ప్రాధాన్యతనిచ్చే భారత్‌ను నిర్మించేందుకు ఈ నమ్మకమే శక్తినిస్తుందని పేర్కొన్నారు.

శివగిరి మఠంతో అనుబంధం ఉన్న వారితో పాటు సాధువులకు శ్రీ నారాయణ గురు, మఠం పట్ల తనకున్న లోతైన అచంచలమైన విశ్వాసం గురించి బాగా తెలుసని ప్రధాని ప్రధానంగా చెప్పారు. మఠంలోని గౌరవనీయులైన సాధువుల ప్రేమాభిమానాలు, ఆశీర్వాదాలు తనకు ఎల్లప్పుడూ దక్కాయని అన్నారు. ఈ సందర్భంగా 2013లో జరిగిన కేదార్‌నాథ్ వరదలను ఆయన గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో శివగిరి మఠం నుంచి చాలా మంది వ్యక్తులు అక్కడ చిక్కుకుపోయారని, వారిని సురక్షితంగా తరలించే బాధ్యతను అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రికి మఠం అప్పగించిందని తెలిపారు. సంక్షోభ సమయాల్లో ఒకరి దృష్టి మొదటగా తమ సొంతమని భావించే, తనలో ఒకరని అనుకునే, వారి పట్ల బాధ్యత ఉందని భావించే వారిపై ఉంటుందని అన్నారు. శివగిరి మఠంలోని సాధువులు తనను బంధువుల భావిస్తారని, ఎంతో నమ్మకాన్ని చూపిస్తారని తెలిపారు. దీని కంటే గొప్ప ఆధ్యాత్మిక సంతృప్తి మరొకటి ఉండదని ఆయన వ్యాఖ్యానించారు.

కాశీతో తనకున్న సంబంధాని ప్రధానంగా చెబుతూ.. వర్కాలను చాలా కాలం నుంచి దక్షిణ కాశీగా పిలుస్తున్నారని అన్నారు. ఉత్తరాదిలో ఉన్నా, దక్షిణాదిలో ఉన్నా.. ప్రతి కాశీ తనదేనని వ్యాఖ్యానించారు. .

భారత ఆధ్యాత్మిక సంప్రదాయాల..ఋషులు, సిద్ధుల వారసత్వాన్ని దగ్గరగా అర్థం చేసుకొని జీవించే అదృష్టం తనకు లభించిందని మోదీ అన్నారు. దేశం సంక్షోభాన్ని ఎదుర్కొన్నప్పుడల్లా దేశంలోని ఏదో ఒక మూల నుంచి వచ్చిన ఒక గొప్ప వ్యక్తి సమాజానికి కొత్త మార్గాన్ని చూపించారని అన్నారు. ఇదే భారతదేశ ప్రత్యేకబలమని ప్రధానంగా చెప్పారు. కొందరు సమాజంలో ఆధ్యాత్మిక ఉద్ధరణకు కృషి చేశారని, మరికొందరు సామాజిక సంస్కరణలను వేగవంతం చేశారని పేర్కొన్నారు. అలాంటి గొప్ప సాధువు శ్రీ నారాయణ గురు అని ప్రధాని వ్యాఖ్యానించారు. ఆయన రాసిన 'నివృత్తి పంచకం', 'ఆత్మోపదేశ శతకం' వంటి రచనలు అద్వైత తత్వం, ఆధ్యాత్మికతను అధ్యయనం చేసే ఏ విద్యార్థికైనా మార్గదర్శకులుగా పనిచేస్తాయని పేర్కొన్నారు.

యోగా, వేదాంతం, ఆధ్యాత్మిక సాధన, మోక్షం అనే అంశాలు శ్రీ నారాయణ గురుకు ప్రధానమైన అంశాలని గుర్తుచేసిన మోదీ.. సామాజిక దురాచారాలలో చిక్కుకున్న సమాజంలో ఆధ్యాత్మికతను దాని సామాజిక పురోగతి ద్వారానే సాధించొచ్చని శ్రీ నారాయణ గురు భావించారని ప్రధానంగా చెప్పారు. ఆధ్యాత్మికతను సామాజిక సంస్కరణలు, ప్రజా సంక్షేమం కోసం ఒక మాధ్యమంగా ఆయన మార్చారని అన్నారు. మహాత్మాగాంధీ కూడా ఆయన చేసిన పనుల నుంచే ప్రేరణ, మార్గదర్శకత్వం పొందారని వ్యాఖ్యానించారు. గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి వారు కూడా శ్రీ నారాయణ గురుతో చర్చల ద్వారా ప్రయోజనం పొందారని ప్రధాని అన్నారు.

శ్రీ నారాయణ గురు ఆత్మోపదేశ శతకంను ఎవరో రమణ మహర్షికి వినిపించిన సందర్భాన్ని ప్రస్తావించిన మోదీ.. దానిని విన్న రమణ మహర్షి "ఆయనకు అన్నీ తెలుసు" అని వ్యాఖ్యానించినట్లు తెలిపారు. విదేశీ భావజాలాలు భారతీయ నాగరికత, సంస్కృతి, తత్వశాస్త్రాన్ని అణగదొక్కడానికి ప్రయత్నించిన సమయాన్ని ఆయన గుర్తు చేశారు. మన లోపం మన అసలు సంప్రదాయాల్లో లేదని, మన ఆధ్యాత్మికతను నిజంగా లోతుగా సాధన చేయాల్సిన అవసరం ఉందని గ్రహించేలా ఆయన చేశారన్నారు. మనం ప్రతి మానవుడిలో నారాయణుడిని, ప్రతి జీవిలో ఈశ్వరున్ని చూసే వాళ్లమని ఆయన పేర్కొన్నారు. ద్వంద్వత్వంలో ద్వంద్వం కానితనాన్ని, భిన్నత్వంలో ఏకత్వాన్ని, స్పష్టమైన తేడాల్లో కూడా ఏకత్వాన్ని మనం చూస్తామని అన్నారు.

శ్రీ నారాయణ గురు మంత్రం – 'ఒరు జాతి, ఒరు మతం, ఒరు దైవం, మనుష్యానుం' అంటే 'ఒకే కులం, ఒకే మతం, మానవాళికి ఒకే దేవుడు' అనే మంత్రం అందరికీ తెలుసునని అన్నారు. ఇది మానవాళి, జీవుల ఐక్యతను తెలియజేస్తుందని పేర్కొన్నారు. ఈ తత్వశాస్త్రమే భారత నాగరికత తత్వానికి పునాదిగా నిలుస్తోందని ప్రధానంగా చెప్పారు. ప్రపంచ సంక్షేమ స్ఫూర్తితో ఈ తత్వాన్ని ప్రస్తుతం భారత్ విస్తరింపజేస్తోందని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ప్రధానంగా ప్రస్తావిస్తూ.. ఈ ఏడాది ఇతివృత్తం 'ఒకే ధరిత్రి, ఒకే ఆరోగ్యం కోసం యోగా' అని వ్యాఖ్యానించారు. ఇది ఒకే గ్రహం, సార్వత్రిక శ్రేయస్సు అనే దార్శనికతను సూచిస్తోందని తెలిపారు. గతంలో మానవాళి సంక్షేమం కోసం 'ఒకే ప్రపంచం, ఒకే ఆరోగ్యం' వంటి ప్రపంచ స్థాయి కార్యక్రమాలను కూడా భారత్ చేపట్టిందని పేర్కొన్నారు. ఇప్పుడు సుస్థిరాభివృద్ధి దిశగా జరుగుతోన్న ప్రపంచ స్థాయి ఉద్యమాలకు భారత్ నాయకత్వం వహిస్తోందని.. 'ఒకే సూర్యుడు, ఒకే భూమి, ఒకే గ్రిడ్' అనేది అందులో ఒకటని తెలిపారు. 2023లో జీ20 శిఖరాగ్ర సమావేశానికి భారత్ అధ్యక్షత వహించినప్పుడు అనుసరించిన 'ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు' అనే ఇతివృత్తాన్ని ప్రధానమంత్రి గుర్తుచేశారు. ఇవన్నీ 'వసుధైవ కుటుంబకం' అనే స్ఫూర్తితో ఉన్నాయని, శ్రీ నారాయణ గురు వంటి సాధువులతో ప్రేరణ పొందాయని అన్నారు.

"వివక్ష లేని సమాజం గురించి శ్రీ నారాయణ గురు కలలు కన్నారు. నేడు దేశం సంతృప్త విధానాన్ని అనుసరించడం ద్వారా వివక్షకు అవకాశం ఉన్న ప్రతి దానిని తొలగిస్తోంది'' అని మోదీ వ్యాఖ్యానించారు. 10, 11 సంవత్సరాల క్రితం పరిస్థితులను ప్రజలంతా గుర్తుకు తెచ్చుకోవాలని అన్నారు. అప్పటికి స్వాతంత్ర్యం వచ్చి కొన్ని దశాబ్దాలైనప్పటికీ లక్షలాది మంది ప్రజలు చాలా క్లిష్ట పరిస్థితుల్లో జీవించవలసి వచ్చిందని అన్నారు. లక్షలాది కుటుంబాలకు ఆశ్రయం లేదని, లెక్కలేనన్ని గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో లేదని, ఆరోగ్య సంరక్షణ లేకపోవడం వల్ల చిన్న అనారోగ్యాలకు కూడా చికిత్స పొందలేని పరిస్థితి, తీవ్రమైన అనారోగ్య సందర్భాల్లో ప్రాణాలను కాపాడుకునే మార్గం లేని పరిస్థితి ఉండేదని ప్రధానంగా పేర్కొన్నారు. దళితులు, గిరిజనులు, మహిళలతో కూడిన లక్షలాది మంది పేదలుప్రాథమిక జీవన గౌరవాన్ని కోల్పోయారని అన్నారు. ఈ కష్టాలు తరతరాలుగా కొనసాగాయని, దీనివల్ల చాలామంది మెరుగైన జీవితం ఉంటుందనే ఆశనే వదులుకునే పరిస్థితి ఏర్పడిందని విచారం వ్యక్తం చేశారు. ఇంత భారీ సంఖ్యలో జనాభా బాధ, నిరాశతో జీవిస్తున్నప్పుడు దేశం ఎలా పురోగతి సాధించగలదని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ విధానాల్లో దయాగుణాన్ని కేంద్ర భాగంగా చేసి, సేవ చేయటాన్ని లక్ష్యంగా మార్చుకున్నట్లు ప్రధానంగా తెలిపారు. దీని ఫలితంగానే ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద లక్షలాది పేదలు, దళితులు, బాధిత, అణగారిన కుటుంబాలకు శాశ్వత గృహాలు కల్పించినట్లు పేర్కొన్నారు. ప్రతి పేదవాడికి ఇల్లు ఇవ్వాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని ఆయన పునరుద్ఘాటించారు. ఈ పథకంలో ఇచ్చిన ఇళ్లు కేవలం ఇటుక, సిమెంట్ నిర్మాణాలే కాకుండా.. అవసరమైన అన్ని సౌకర్యాలతో పూర్తి ఇళ్లు అనే భావనను లబ్ధిదారులకు ఇస్తున్నాయని అన్నారు. అందుకే ఈ పథకం కింద నిర్మించిన ఇళ్లు గ్యాస్, విద్యుత్, పారిశుద్ధ్య సౌకర్యాలతో ఉంటాయి. ప్రతి ఇంటికి పరిశుభ్రమైన నీటిని అందిస్తోన్న జల్ జీవన్ మిషన్ గురించి మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు ఎప్పుడూ చేరుకోని గిరిజన ప్రాంతాలలో కూడా ఇప్పుడు అభివృద్ధికి హామీ లభిస్తోందని ప్రధానంగా పేర్కొన్నారు. అత్యంత అణగారిన గిరిజన వర్గాలకు ప్రధానమంత్రి జన్మన్ యోజనను తీసుకొచ్చామని, దీనితో అనేక ప్రాంతాలు అభివృద్ధి పథం వైపు నడుస్తున్నాయని అన్నారు. దీని కారణంగా సమాజంలోని అట్టడుగు స్థాయిలలో ఉన్నవారు కూడా సరికొత్త ఆశను పొందుతున్నారని వ్యాఖ్యానించారు. "ఈ కార్యక్రమాలు వారి జీవితాలను మార్చడమే కాకుండా, జాతి నిర్మాణంలో వాళ్లు కీలక పాత్ర పోషించేలా చేస్తున్నాయి" అని ఆయన అన్నారు.

మహిళల సాధికారతకు ప్రాధాన్యాన్ని ఇవ్వాలని శ్రీ నారాయణ గురు పదే పదే స్పష్టంచేస్తూ వచ్చారనీ, 'మహిళల నాయకత్వంలో అభివృద్ధిని సాధించాలి' అనే మంత్రంతో ప్రభుత్వం ముందుకు కదులుతోందనీ ప్రధానమంత్రి తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా, మహిళలకు ప్రవేశం లేని రంగాలు అనేకం ఉన్నాయని ఆయన అన్నారు. ఈ ఆంక్షలను ప్రభుత్వం ఎత్తివేసి, మహిళలు కొత్త కొత్త రంగాల్లో అడుగుపెట్టే స్థితిని కల్పించిందని ఆయన చెప్పారు. ఇవాళ... క్రీడలు మొదలు అంతరిక్షం వరకు... ప్రతి రంగంలోనూ మహిళలు దేశాన్ని గర్వపడేటట్లు చేస్తున్నారని శ్రీ మోదీ ప్రధానంగా ప్రస్తావించారు. సంఘంలోని ప్రతి ఒక్క వర్గం, ప్రతి ఒక్క విభాగం ప్రస్తుతం 'అభివృద్ధి చెందిన భారత్' కలను నిజం చేయడానికి తన వంతు తోడ్పాటును అందిస్తున్నాయని ప్రధానమంత్రి అన్నారు. 'స్వచ్ఛ్ భారత్ మిషన్', పర్యావరణ ప్రధాన ప్రచారోద్యమాలు, 'అమృత్ సరోవర్'ల నిర్మాణం, చిరు ధాన్యాలపై జాగృతిని పెంచే కార్యక్రమాలను గురించి ప్రధానమంత్రి ప్రస్తావించారు. ఈ ప్రయత్నాలు ప్రజల ఉత్సాహంతో, 140 కోట్ల మంది భారతీయుల అండదండలతో పురోగమిస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు.శ్రీ నారాయణ గురు దృష్టికోణం అజరామరమని శ్రీ మోదీ వెల్లడించారు. "విద్య ద్వారా జ్ఞానం, కలిసి ఉండటం ద్వారా శక్తిమంతం కావడం, పరిశ్రమ ద్వారా సమృద్ధి"... ఇదే శ్రీ నారాయణ గురు బోధించిందని ప్రధానమంత్రి అన్నారు. "శ్రీ నారాయణ గురు ఈ తరహా దార్శనికతను ప్రవచించడం ఒక్కటే కాకుండా, దీనిని సాకారం చేయడానికి వ్యవస్థాగత ఏర్పాట్లు కూడా చేశారు'' అని శ్రీ మోదీ చెప్పారు. గురూజీ... శారదా మఠాన్ని ఏర్పాటు చేసింది శివగిరిలోనేననీ, దీనిని సరస్వతి దేవికి అంకితం చేశారని తెలిపారు. సమాజంలో ఆదరణకు నోచుకోని వర్గాల విముక్తికీ, వారి అభ్యున్నతికీ విద్య ఒక సాధనంగా తప్పక రూపొందాలనే విశ్వాసానికి ప్రతీకగా ఈ సంస్థ నిలిచిందని ఆయన ఉద్ఘాటించారు. గురుదేవ్ మొదలుపెట్టిన ప్రయత్నాలు ఈ రోజుకు కూడా దేశం నలుమూలలా అనేక నగరాలకు విస్తరిస్తూనే ఉన్నాయనీ, గురుదేవ్ సెంటర్లతో పాటు శ్రీ నారాయణ కల్చరల్ మిషన్ మానవ జాతి సంక్షేమానికి చురుకుగా పనిచేస్తోందనీ చెప్తూ శ్రీ నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు.''విద్య, సంస్థ, పారిశ్రామిక పురోగతి ద్వారా సాంఘిక సంక్షేమ సాధనకు సంబంధించిన దృష్టికోణం దేశం అనుసరిస్తున్న ప్రస్తుత విధానాల్లోనూ, తీసుకొంటున్న నిర్ణయాల్లోనూ స్పష్టంగా ప్రతిబింబిస్తోంది" అని ప్రధానమంత్రి అన్నారు. ఎన్నో దశాబ్దాల తరువాత, ఒక కొత్త జాతీయ విద్యావిధానాన్ని అమలు చేశామని ఆయన చెప్పారు. ఈ విధానం విద్యను ఆధునికీకరించడం ఒక్కటే కాకుండా విద్యను మరిన్ని వర్గాల వారి వద్దకు తీసుకు పోతుందనీ, మాతృభాషను నేర్చుకోవడాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. సమాజంలో నిరాదరణకు గురైన వర్గాల వారికి దీనివల్ల లబ్ది చేకూరిందని ఆయన స్పష్టం చేశారు. గడచిన పదేళ్లుగా దేశం నలుమూలలా ఏర్పాటు చేసిన కొత్త ఐఐటీలు, ఐఐఎంలతో పాటు ఏఐఐఎంఎస్‌ల సంఖ్య, స్వాతంత్ర్యం అనంతరం 60 సంవత్సరాల్లో నెలకొల్పిన మొత్తం విద్యాసంస్థల సంఖ్యను దాటిపోయిందని శ్రీ మోదీ వివరించారు. ఫలితంగా పేదలకూ, ప్రయోజనాలను అందుకోలేకపోయిన వర్గాలకూ ఉన్నత విద్య లో కొత్త కొత్త అవకాశాలు అందివస్తున్నాయన్నారు. గత పది సంవత్సరాల్లో గిరిజన ప్రాంతాల్లో 400 కన్నా ఎక్కువ 'ఏకలవ్య ఆశ్రమ పాఠశాలల'ను ప్రారంభించినట్లు ప్రధానమంత్రి తెలిపారు. తరాల తరబడి చదువుకోలేకపోయిన ఆదివాసీలకు చెందిన బాల బాలికలు ఇప్పుడు అభివృద్ధి పథంలో ఉన్నారని ఆయన అన్నారు. విద్యకూ, నైపుణ్యాలు–అవకాశాలకూ మధ్య ప్రత్యక్ష సంబంధం ఉందని కూడా తెలిపారు. 'స్కిల్ ఇండియా' వంటి కార్యక్రమాలు యువతీయువకులకు తమ సొంత కాళ్ల మీద నిలబడే సాధికారతను అందిస్తున్నాయన్నారు. పారిశ్రామికంగా దేశం సాధించిన ప్రగతిని శ్రీ మోదీ వివరిస్తూ, ప్రయివేటు రంగంలో ప్రధాన సంస్కరణలూ, 'ముద్రా యోజన', 'స్టాండ్–అప్ ఇండియా' వంటి పథకాలూ దళితులకు, వెనుకబడిన వర్గాల వారితో పాటు గిరిజనులకు ఎన్నో ప్రయోజనాలను అందిస్తున్నాయని శ్రీ మోదీ వివరించారు.''ఒక బలమైన, శక్తిమంతమైన భారత్‌ను శ్రీ నారాయణ గురు దర్శించారు. మరి ఈ దృష్టికోణాన్ని సాకారం చేయడానికి భారత్ ఆర్థిక, సామాజిక, సైన్య రంగాలన్నింటా అగ్రగామిగా నిలిచి తీరాలి'' అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. ఈ మార్గం గుండా దేశం స్థిరంగా పయనిస్తోందనీ, ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారే దిశలో శరవేగంగా దూసుకుపోతోందనీ ఆయన తెలిపారు. ప్రపంచం ఇటీవల భారత్ సత్తా ఎంతటిదో గమనించిందని శ్రీ మోదీ అన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ దృఢమైన, అసలంతమాత్రం రాజీ పడని విధానాన్ని అనుసరిస్తోందని 'ఆపరేషన్ సిందూర్' ప్రపంచానికి స్పష్టం చేసిందన్నారు. భారతీయ పౌరుల రక్తాన్ని చిందించే ఉగ్రవాదులు తలదాచుకోవడానికిక ఏ ఆశ్రయం సురక్షితం కానే కాదని భారత్ రుజువు చేసిందని ఆయన అన్నారు. "జాతి హితానికి ఏది సరైందన్న ఒకే ఒక ప్రాతిపదికన నేటి భారత్ నిర్ణయాలను తీసుకొంటోంది'' అని శ్రీ మోదీ తెలిపారు. సైన్యం అవసరాల కోసం విదేశాలపై మన దేశం ఆధారపడటం అంతకంతకూ తగ్గుతోందని ఆయన స్పష్టం చేశారు. రక్షణ రంగంలో ఇండియా స్వయంసమృద్ధంగా ఎదుగుతోందని ప్రధానంగా ప్రస్తావించారు. ఈ మార్పు 'ఆపరేషన్ సిందూర్' వేళ స్పష్టంగా నిరూపణ అయిందని, 'ఆపరేషన్ సిందూర్'లో భారత దళాలు దేశీయంగా తయారైన ఆయుధాలను ఉపయోగించి 22 నిమిషాల వ్యవధిలోనే... లొంగిపోక తప్పని స్థితిని శత్రువుకు కల్పించాయని ప్రధానమంత్రి చెప్పారు. రాబోయే కాలంలో, భారత్‌లో తయారు చేసిన ఆయుధాలు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపును పొంది, ప్రశంసలను దక్కించుకొంటాయన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.దేశ ఆకాంక్షలను నెరవేర్చాలంటే శ్రీ నారాయణ గురు బోధనలను పౌరులందరి చెంతకు తీసుకుపోవడం అత్యవసరమని ప్రధానమంత్రి స్పష్టం చేస్తూ, ప్రభుత్వం ఈ దిశగా చురుకుగా పనిచేస్తోందని తెలిపారు. శ్రీ నారాయణ గురు జీవనంతో ముడి వడిన తీర్థయాత్రా స్థలాలను అనుసంధానించడానికి 'శివగిరి సర్క్యూట్'ను అభివృద్ధిపరిచే పనులు వేగంగా సాగుతున్నాయని ఆయన గుర్తు చేశారు. 'అమృత్ కాల్' ద్వారా దేశం సాగిస్తున్న ప్రయాణానికి శ్రీ నారాయణ గురు ఆశీర్వాదాలు, ప్రబోధాలు మార్గదర్శకత్వం వహిస్తూనే ఉంటాయన్న విశ్వాసాన్ని శ్రీ మోదీ వ్యక్తం చేశారు. అభివృద్ధి చెందిన దేశం కలను భారతదేశ ప్రజలంతా కలిసికట్టుగా నెరవేరుస్తారని రూఢిగా చెప్పారు. శ్రీ నారాయణ గురు ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ లభించాలని కోరుకుంటూ, శివగిరి మఠం సాధువులందరి పట్ల తన భక్తిశ్రద్ధలను మరోసారి వ్యక్తం చేస్తూ ప్రధానమంత్రి ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ వ్యవహారాలు, మత్స్య పరిశ్రమ, పశు సంవర్ధకం, పాడి పరిశ్రమ శాఖ సహాయ మంత్రి శ్రీ జార్జ్ కురియన్, శ్రీ నారాయణ ధర్మ సంఘం ట్రస్టుకు చెందిన సాధువులతో పాటు ఇతర ప్రముఖులు కూడా పాల్గొన్నారు.నేపథ్యంమన దేశంలో ఆధ్యాత్మికంగా, నైతికంగా మహానాయకులైన శ్రీ నారాయణ గురు, మహాత్మా గాంధీల మధ్య 1925 మార్చి నెల 12న శివగిరి మఠంలో చరిత్రాత్మక సంభాషణ చోటు చేసుకొంది. ఆ మఠాన్ని మహాత్మాగాంధీ అప్పట్లో సందర్శించారు. వారిద్దరి మధ్యా జరిగిన సంభాషణలో వైకొం సత్యాగ్రహం, మత మార్పిళ్లు, అహింస, అంటరానితనం నిర్మూలన, మోక్ష సాధన, అణగారిన వర్గాల వారి అభ్యున్నతి తదితర అంశాలు ప్రస్తావనకు వచ్చాయి.శ్రీ నారాయణ ధర్మ సంఘం ట్రస్టు ఏర్పాటు చేసిన ఈ వేడుక ఆధ్యాత్మిక నేతలను, ఇతర సభ్యులను ఒక చోటుకు చేర్చింది. వారు భారత సామాజిక, నైతిక స్వరూపానికి ఇప్పటికీ ఇంకా తాజాగా రూపురేఖలను తీర్చిదిద్దుతూ వస్తున్న దార్శనికతను గుర్తుచేసుకొని తమ ఆలోచనలను వెల్లడించడానికి ఈ వేడుకను నిర్వహించారు. ఇది శ్రీ నారాయణ గురు, మహాత్మాగాంధీ.. వీరు ఇరువురూ సమర్థించిన సామాజిక న్యాయం, ఏకత, ఆధ్యాత్మిక సామరస్యాలు అలరారే దృష్టికోణానికి ఒక శక్తిమంతమైన నివాళిగా నిలుస్తోంది.××


మహిళల సాధికారతకు ప్రాధాన్యాన్ని ఇవ్వాలని శ్రీ నారాయణ గురు పదే పదే స్పష్టంచేస్తూ వచ్చారనీ, 'మహిళల నాయకత్వంలో అభివృద్ధిని సాధించాలి' అనే మంత్రంతో ప్రభుత్వం ముందుకు కదులుతోందనీ ప్రధానమంత్రి తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా, మహిళలకు ప్రవేశం లేని రంగాలు అనేకం ఉన్నాయని ఆయన అన్నారు. ఈ ఆంక్షలను ప్రభుత్వం ఎత్తివేసి, మహిళలు కొత్త కొత్త రంగాల్లో అడుగుపెట్టే స్థితిని కల్పించిందని ఆయన చెప్పారు. ఇవాళ... క్రీడలు మొదలు అంతరిక్షం వరకు... ప్రతి రంగంలోనూ మహిళలు దేశాన్ని గర్వపడేటట్లు చేస్తున్నారని శ్రీ మోదీ ప్రధానంగా ప్రస్తావించారు. సంఘంలోని ప్రతి ఒక్క వర్గం, ప్రతి ఒక్క విభాగం ప్రస్తుతం 'అభివృద్ధి చెందిన భారత్' కలను నిజం చేయడానికి తన వంతు తోడ్పాటును అందిస్తున్నాయని ప్రధానమంత్రి అన్నారు. 'స్వచ్ఛ్ భారత్ మిషన్', పర్యావరణ ప్రధాన ప్రచారోద్యమాలు, 'అమృత్ సరోవర్'ల నిర్మాణం, చిరు ధాన్యాలపై జాగృతిని పెంచే కార్యక్రమాలను గురించి ప్రధానమంత్రి ప్రస్తావించారు. ఈ ప్రయత్నాలు ప్రజల ఉత్సాహంతో, 140 కోట్ల మంది భారతీయుల అండదండలతో పురోగమిస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు.

శ్రీ నారాయణ గురు దృష్టికోణం అజరామరమని శ్రీ మోదీ వెల్లడించారు. "విద్య ద్వారా జ్ఞానం, కలిసి ఉండటం ద్వారా శక్తిమంతం కావడం, పరిశ్రమ ద్వారా సమృద్ధి"... ఇదే శ్రీ నారాయణ గురు బోధించిందని ప్రధానమంత్రి అన్నారు. "శ్రీ నారాయణ గురు ఈ తరహా దార్శనికతను ప్రవచించడం ఒక్కటే కాకుండా, దీనిని సాకారం చేయడానికి వ్యవస్థాగత ఏర్పాట్లు కూడా చేశారు'' అని శ్రీ మోదీ చెప్పారు. గురూజీ... శారదా మఠాన్ని ఏర్పాటు చేసింది శివగిరిలోనేననీ, దీనిని సరస్వతి దేవికి అంకితం చేశారని తెలిపారు. సమాజంలో ఆదరణకు నోచుకోని వర్గాల విముక్తికీ, వారి అభ్యున్నతికీ విద్య ఒక సాధనంగా తప్పక రూపొందాలనే విశ్వాసానికి ప్రతీకగా ఈ సంస్థ నిలిచిందని ఆయన ఉద్ఘాటించారు. గురుదేవ్ మొదలుపెట్టిన ప్రయత్నాలు ఈ రోజుకు కూడా దేశం నలుమూలలా అనేక నగరాలకు విస్తరిస్తూనే ఉన్నాయనీ, గురుదేవ్ సెంటర్లతో పాటు శ్రీ నారాయణ కల్చరల్ మిషన్ మానవ జాతి సంక్షేమానికి చురుకుగా పనిచేస్తోందనీ చెప్తూ శ్రీ నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు.

"విద్య, సంస్థ, పారిశ్రామిక పురోగతి ద్వారా సాంఘిక సంక్షేమ సాధనకు సంబంధించిన దృష్టికోణం దేశం అనుసరిస్తున్న ప్రస్తుత విధానాల్లోనూ, తీసుకొంటున్న నిర్ణయాల్లోనూ స్పష్టంగా ప్రతిబింబిస్తోంది" అని ప్రధానమంత్రి అన్నారు. ఎన్నో దశాబ్దాల తరువాత, ఒక కొత్త జాతీయ విద్యావిధానాన్ని అమలు చేశామని ఆయన చెప్పారు. ఈ విధానం విద్యను ఆధునికీకరించడం ఒక్కటే కాకుండా విద్యను మరిన్ని వర్గాల వారి వద్దకు తీసుకు పోతుందనీ, మాతృభాషను నేర్చుకోవడాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. సమాజంలో నిరాదరణకు గురైన వర్గాల వారికి దీనివల్ల లబ్ది చేకూరిందని ఆయన స్పష్టం చేశారు. గడచిన పదేళ్లుగా దేశం నలుమూలలా ఏర్పాటు చేసిన కొత్త ఐఐటీలు, ఐఐఎంలతో పాటు ఏఐఐఎంఎస్‌ల సంఖ్య, స్వాతంత్ర్యం అనంతరం 60 సంవత్సరాల్లో నెలకొల్పిన మొత్తం విద్యాసంస్థల సంఖ్యను దాటిపోయిందని శ్రీ మోదీ వివరించారు. ఫలితంగా పేదలకూ, ప్రయోజనాలను అందుకోలేకపోయిన వర్గాలకూ ఉన్నత విద్య లో కొత్త కొత్త అవకాశాలు అందివస్తున్నాయన్నారు. గత పది సంవత్సరాల్లో గిరిజన ప్రాంతాల్లో 400 కన్నా ఎక్కువ 'ఏకలవ్య ఆశ్రమ పాఠశాలల'ను ప్రారంభించినట్లు ప్రధానమంత్రి తెలిపారు. తరాల తరబడి చదువుకోలేకపోయిన ఆదివాసీలకు చెందిన బాల బాలికలు ఇప్పుడు అభివృద్ధి పథంలో ఉన్నారని ఆయన అన్నారు. విద్యకూ, నైపుణ్యాలు–అవకాశాలకూ మధ్య ప్రత్యక్ష సంబంధం ఉందని కూడా తెలిపారు. 'స్కిల్ ఇండియా' వంటి కార్యక్రమాలు యువతీయువకులకు తమ సొంత కాళ్ల మీద నిలబడే సాధికారతను అందిస్తున్నాయన్నారు. పారిశ్రామికంగా దేశం సాధించిన ప్రగతిని శ్రీ మోదీ వివరిస్తూ, ప్రయివేటు రంగంలో ప్రధాన సంస్కరణలూ, 'ముద్రా యోజన', 'స్టాండ్–అప్ ఇండియా' వంటి పథకాలూ దళితులకు, వెనుకబడిన వర్గాల వారితో పాటు గిరిజనులకు ఎన్నో ప్రయోజనాలను అందిస్తునాన్నయని శ్రీ మోదీ వివరించారు.

"ఒక బలమైన, శక్తిమంతమైన భారత్‌ను శ్రీ నారాయణ గురు దర్శించారు. మరి ఈ దృష్టికోణాన్ని సాకారం చేయడానికి భారత్ ఆర్థిక, సామాజిక, సైన్య రంగాలన్నింటా అగ్రగామిగా నిలిచి తీరాలి" అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు.

